

## ఆయన్ని డైరెక్ట్ చేయడమంటే యూనివర్సిటీకి పాఠాలు చెప్పడమే!

'చేయాల్సిన ప్రయోగాలన్నీ ముందే చేసేస్తే, కొత్తగా చేయటానికి ఏముంటుంది?' కమల్‌హాసన్ కెరీర్ విషయంలో సినీ మేధావుల అభిప్రాయమిది. నిజానికి కమల్ రీసెంట్ బ్లాక్‌బాస్టర్ 'విక్రమ్' కూడా ఆయనకు కొత్త పాత్రేం కాదు. గతంలో అలాంటివి ఎన్నో చేశారాయన. కథ పాతదైనా కొత్తగా చెప్పటం, పాత్ర పాతదైనా కొత్తగా డిజైన్ చేయడం, ఇదే కమల్ విషయంలో దర్శకులు చేయాల్సిన పని. ప్రస్తుతం కమల్ స్క్రిప్ట్‌పైనే కిందామీదా పడుతున్నాడు దర్శకుడు హెచ్.వినోద్. తమిళంలో 'చతురంగ వేట్టై' లాంటి విభిన్నమైన సినిమాకు దర్శకత్వం వహించి, కార్తీతో 'ఖాకీ' లాంటి విజయాన్ని అందుకున్న వినోద్, త్వరలోనే కమల్‌హాసన్‌కి 'యాక్షన్' చెప్పనున్నారు. కమల్ డేట్స్ ఇచ్చినప్పట్నుంచీ దాదాపు మూడేళ్లుగా ఈ కథపైనే కసరత్తులు చేస్తున్నారు వినోద్. ఈ లోపు 'విక్రమ్' వచ్చేసింది. మరోవైపు 'భారతీయుడు-2' కూడా విడుదలకు రెడీ అయిపోతున్నది. వినోద్ లేట్ చేస్తున్న కారణంగా పాన్ ఇండియా మూవీ 'కల్కి'కి కమల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఆ వెనుకే మణిరత్నం కూడా రెడీగా ఉన్నాడు. అందుకే ఇక ఆలస్యం మంచిదికాదని కథని లాక్ చేసేశాడంట వినోద్.. 'కల్కి' తర్వాత కమల్ చేసే సినిమా ఇదేనని టాక్. 'కమల్ హాసన్‌గారి కెరీర్‌లో పూర్తి విభిన్నమైన కథ అని చెప్పను. ఆయన చేయని పాత్ర లేదు. చెప్పని కథలేదు. ఆయన్ని దర్శకత్వం చేయడమంటే యూనివర్సిటీకి పాఠాలు చెప్పటమే. అందుకే తిప్పలు పడుతున్నాను' అన్నారు దర్శకుడు విజయ్.

## శానా యేండ్లు యాదుంటాది



అనిల్ రావిపూడి, శ్రీలీల, సాహు గారపాటి

'ఓ దర్శకుడిగా 'భగవంత్ కేసరి' చిత్రం నాకు పూర్తి సంతృప్తినిచ్చింది. విడుదలైన అన్ని కేంద్రాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తున్నది' అన్నారు చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి. బాలకృష్ణ కథానాయకుడిగా ఆయన దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ సంస్థ తెరకెక్కించిన 'భగవంత్ కేసరి' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం బ్లాక్‌బస్టర్ ప్రెస్‌మీట్‌ను నిర్వహించారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఈ సినిమాలోని తండ్రీ కూతురు ఎమోషన్‌కు ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతున్నారు. ఆడపిల్లను సింహంలా పెంచాలనే సందేశం ప్రేక్షకుల్లోకి బాగా వెళ్లింది. బాలకృష్ణగారు తన కంఫర్ట్‌జోన్ దాటి మహిళా సాధికారత కలిగిన గొప్ప కథలో నటించారు. శ్రీలీల విజ్జీ పాపగా అద్భుతంగా నటించింది. బాలకృష్ణతో కలిసి త్వరలో పెద్ద ఈవెంట్‌ను నిర్వహించబోతున్నాం. ఈ సినిమా ప్రమోషన్‌లో చెప్పినట్లు 'ఈ సినిమా శానా యేండ్లు యాదుంటాది'' అన్నారు. ఈ సినిమాతో నటిగా తనను చూసే విధానం మారిందని, గొప్ప పాత్రను పోషించే అవకాశం దక్కిందని శ్రీలీల ఆనందం వ్యక్తం చేసింది. ప్రతీ కేంద్రంలో హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో ప్రదర్శింపబడుతున్నదని నిర్మాత సాహు గారపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో గీత రచయితలు అనంత్ శ్రీరామ్, రామజోగయ్య శాస్త్రి పాల్గొన్నారు.



అశోక్ వర్ధన్, కల్యాణ్‌రామ్, సయీ మంజ్రేకర్, ప్రదీప్, సునీల్ బలుసు

## శక్తిమంతమైన పాత్రలో కల్యాణ్‌రామ్

హీరో కల్యాణ్‌రామ్ కొత్త సినిమా మొదలైంది. సయీ మంజ్రేకర్ కథానాయిక. విజయశాంతి కీలక పాత్ర పోషించనుండటం విశేషం. ప్రదీప్ చిలుకూరిని దర్శకుడిగా పరిచయం చేస్తూ అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పలువురు సినీ ప్రముఖులు ఈ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి విజయశాంతి క్లాప్ కొట్టగా, మురళీమోహన్ కెమెరా స్విచాన్ చేశారు. ముప్పా వెంకయ్యచౌదరి స్క్రిప్ట్ అందించారు. కల్యాణ్‌రామ్ కెరీర్‌లో మైలురాయిలా నిలిచిపోయేంత మంచి కథ ఈ సినిమాకు కుదిరిందని, అత్యంత శక్తిమంతంగా ఆయన పాత్ర ఉంటుందని, మిగిలిన వివరాలను త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: సి.రామ్‌ప్రసాద్, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్.





## ఫలించిన విశాల్ పోరాటం

తమిళ నటుడు విశాల్ కేవలం సినిమాలకు మాత్రమే పరిమితం కాకుండా ఇండస్ట్రీ సమస్యలపై పోరాటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ప్రస్తుతం ఆయన తమిళ నిర్మాత మండలి అధ్యక్షుడిగా, నడిగర్ సంఘం సెక్రటరీగా కీలక బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల విడుదలైన తన తాజా చిత్రం 'మార్క్ ఆంటోని' ' హిందీ వెర్షన్ సెన్సార్ విషయంలో బోర్డు సభ్యులు 6.5లక్షల లంచం తీసుకున్నారని విశాల్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన సాక్ష్యాధారాలను కూడా విశాల్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. ఈ వ్యవహారంలో చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన ప్రధాన మంత్రిని అభ్యర్థించారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన మహారాష్ట్ర ప్రభుత్వం అవినీతి అధికారులిద్దరినీ సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తమిళ సినిమాల హిందీ డబ్బింగ్ వెర్షన్ సెన్సార్ విషయంలో నిబంధనలను సడలించింది. తమిళ అనువాద చిత్రాలకు ముంబయిలో సెన్సార్ చేయించాల్సిన అవసరం లేదని, తమిళనాడులోనే సెన్సార్ కార్యక్రమాలు జరుపుకోవచ్చని ఉత్తర్వులు జారీ జేసింది. ఇక నుంచి తమిళ నిర్మాతలు తమ సినిమాల హిందీ వెర్షన్ డబ్బింగ్ కోసం ముంబయికి వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొంది. విశాల్ పోరాటం ఫలితంగానే ఈ సవరణలు జరిగాయని తమిళ ఇండస్ట్రీ వర్గాలు స ంతోషం వ్యక్తం చేశాయి.



ఊర్వశి రౌటేలా

## ఎవరిని ఉద్ధరించటానికి హీరోయిన్ పాత్రలు?

ఐటెం సాంగ్స్ చేసుకోవడం హాయిగా ఉంది. ఎవరిని ఉద్ధరించటానికి హీరోయిన్ క్యారెక్టర్లు?.. అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నది ఈ హాట్ బ్యూటీ ఊర్వశీ రౌటేలా. ఈ మధ్య ఈ అందాలబొమ్మకు హీరోయిన్ ఆఫర్లు తెగ వచ్చేస్తున్నాయంట. వచ్చిన ప్రతి ఆఫర్‌ను ఆమె తిప్పి కొడుతున్నదట. ఇంత అందాన్ని పెట్టుకొని ఐటమ్‌సాంగ్స్ అవసరమా? చక్కగా హీరోయిన్ అయిపోవచ్చుకదా? అనడిగితే 'నిజానికి నాకు ఆఫర్లు చాలా వచ్చాయి, వస్తున్నాయి కూడా. కానీ నాకు హీరోయిన్ పాత్రలపై అంత ఇంట్రస్ట్ లేదు. ఇప్పుడు స్టార్ హీరోల సరసన ఐటమ్ సాంగ్స్ చేస్తున్నాను. రేపు హీరోయిన్ అయితే, చిన్న చిన్న హీరోలతో నటించాలి. గుర్తింపు లేని చిన్న దర్శకులతో పనిచేయాలి. తీరా ఆ సినిమాల ఫలితం సరిగ్గా రాకపోతే, ఆ ప్రభావం నాపై పడుతుంది. అవసరమా? చెప్పండి. చక్కగా పెద్ద పెద్ద హీరోలతో అడుగు కలుపుతూ, పెద్ద పెద్ద దర్శకులతో కలిసి పనిచేస్తున్నాను. ఒక్క రోజులో షూటింగ్ అయిపోతుంది. నా డబ్బులు నాకిచ్చేస్తారు. నా స్టార్‌డమ్‌కి తగ్గ పారితోషికమే ఉంటుంది. దానికితోడు బోల్డంత టైము. ఇంకెందుకంట హీరోయిన్ పాత్రలు?!' అంటూ తెలివిగా సమాధానమిచ్చింది ' ఊర్వశీ రౌటేలా.

## మంచి రోజులు నడుస్తున్నాయి

'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' సినిమా అంటే నాకు ఇష్టం. అందులో నేను చేసిన షానయా పాత్రంటే ఇంకా ఇష్టం. నా లక్కీ కేరక్టర్ అది' అంటున్నది అందాల భామ అలియాభట్. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' సినిమా విడుదలై 11ఏళ్లు పూర్తయింది. అంటే, కథానాయికగా అలియాకు 11ఏళ్లు నిండాయన్నమాట . దాంతో ఫ్యాన్స్‌తో ఇంటరాక్ట్ అయ్యింది అలియా. ' సిద్ధార్థ్ మల్హోత్రా, వరుణ్‌ధావన్‌లకు కూడా హీరోలుగా ఇదే తొలి సినిమా. మా ముగ్గురిదీ ఒకే ఏజ్ గ్రూప్. అందుకే పిక్నిక్‌లా సాగిపోయింది సినిమా. కరణ్‌జోహార్ సార్‌కి ఈ సందర్భంగా థ్యాంక్స్ చెప్పుకోవాలి. నాలో షానయాని చూసింది ఆయనే కదా. కాబట్టే హీరోయిన్‌ని కాగలిగాను. అప్పుడలా పరిచయం అవ్వడం.. ఇప్పుడిలా రాష్ట్రపతి చేతులమీదుగా జాతీయ అవార్డును అందుకోవడం.. అంతా మిరాకిల్. దేవుడు అందరికీ ఓ మంచి దశను ఇస్తాడు. నాకు నడుస్తున్నది అలాంటి దశనే. ఈ పదకొండేళ్లలో నాకు జరిగిన అతిపెద్ద మంచి ఏంటంటే.. రణ్‌బీర్‌లాంటి అందగాడు, మంచివాడు భర్తవ్వడం.' అంటూ ఆనందం వ్యక్తం చేసింది అలియా.



## అనుకున్నవన్నీ జరగవు

శ్రీరామ్, మౌనిక జంటగా నటిస్తున్న చిత్రం 'అనుకున్నవన్ని జరగవు'. జి.సందీప్ దర్శకుడు. శ్రీ భారత ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమా పోస్టర్‌ను శుక్రవారం హీరో అల్లరి నరేష్ విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'క్రైమ్ కామెడీ థ్రిల్లర్ చిత్రమిది. అనూహ్య మలుపులతో కథ సాగుతుంది. వినోదానికి పెద్దపీట వేశాం. నటీనటులు కొత్తవారైనా చక్కటి పర్‌ఫార్మెన్స్ కనబరిచారు' అని అన్నారు. పోసాని కృష్ణమురళి, కిరీటి, మిర్చి హేమంత్, గౌతమ్‌రాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: చిన్నా రామ్, జీవీ అజయ్, సంగీతం: గిడియన్ కట్ట, కథ, దర్శకత్వం: జి.సందీప్.

## శాంతల.. ఓ యదార్థగాథ



నిజజీవితంలో జరిగిన ఓ వీరనారి గాధను ప్రేరణగా తీసుకొని పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రం 'శాంతల'. అశ్లేష ఠాకూర్ టైటిల్‌రోల్ పోషించిన ఈచిత్రానికి త్రివిక్రమ్ శేషు దర్శకుడు. ఇర్రంకి సురేశ్ నిర్మాత. ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు సమర్పకుడు. ఈ చిత్రానికి చెందిన తొలిపాటను ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ విడుదల చేశారు. హళిబేడు, బేలూరు ప్రాంతాల్లో జరిగిన యథార్థగాథ ఆధారంగా రూపొందించిన సినిమా ఇదని, నవంబర్ 3న సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. విశాల్ చంద్రశేఖర్ స్వరాలందించిన ఈ చిత్రానికి కెమెరా: మాన్, నిర్మాణం: ఇండో అమెరికన్ ఆర్ట్స్.





